విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 14, అక్టోబరు 2025

భారీ వర్షానికి ఉల్లి రైతు కుదేల్

- భార్య బంగారు తాకట్టు పెట్టి రుణం
- నీట మునిగిన ఉల్లి పంట
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతు

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని కొండమీది గ్రామాలైన కునుకుంట్ల, ఉప్పలపాడు, జూనూతల, కొండమన్నాయునిపల్లి తదితర గ్రామాలలో సోమవారం వేకువ జామున కురిసిన భారీ వర్షానికి రైతులు సాగుచేసిన మినుము, ఉల్లి వంట నీట మునిగింది. ఈ వర్షం కొందరి రైతులలో ఆనందాన్ని నింపగా మరికొందరి రైతుల్లో దుఃఖాన్ని మిగిల్చింది. కునుకుంట్ల గ్రామానికి చెందిన రైతు మారెన్న గారి కంబగిరి రాముడు తనకున్న ఒకటిన్నర ఎకరా భూమిలో ఉల్లి పంటను సాగు చేశాడు. భారీగా కురిసిన వర్షానికి చేతికి వచ్చిన ఉల్లి పంట నీటిపాలైందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. రైతు మారేన్న గారి జయ రాముడు మాట్లాడుతూ తనకు ఉన్న ఒకటిన్నర ఎకరా పొలంలో ఉల్లి పంట సాగు చేశానని పంట సాగు కోసం తన భార్య బంగారు నగలను బ్యాంకులో తాకట్టు పెట్టి పంట సాగు చేశానన్నాడు. దాదాపు లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టానని, కంటికి రెప్పలా కాపాడుకున్న పంట చేతికి అందే సమయంలో భారీ వర్షానికి నీట మునిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. వ్యవసాయమే జీవనాధారంగా బ్రతుకుతున్న తనకు బ్యాంకు రుణం ఎలా చెల్లించాలి అని వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరుకుంటు న్నాడు. మండల వ్యాప్తంగా రైతులు తమ పొలాలలో పండించిన మొక్కజొన్న పంటను కోసి రోడ్లపై నూర్పులు పోశారు. అకాల వర్షానికి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడ్డారు.

రైతుల బాధ వ్యవసాయ అధికారులకు కనబడదా: భారీ వర్షాలకు నష్ట పోయిన పంటను పరిశీలించి ఉన్నతాధి కారులకు నివేదికలు పంపించాల్సిన వ్యవసాయ అధికారులు తమ పంట వైపు కన్నెత్తి కూడా చూడలేదని వ్యవసాయ అధికారులపై బాధిత రైతు మారెన్న గారి జయరాముడు ఆవేదన వ్యక్తం చేశాడు. పంట నష్టాలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా వ్యవసాయ సహాయ కులు రైతు సేవ కేంద్రాలలో కూర్చుని తూతూ మంత్రంగా నివేదికలు తయారు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

కార్మిక ద్రోహి... నరేంద్ర మోడీ గో బ్యాక్

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: రాష్ట్రానికి తలమాణికమైన ఏకైక పెద్ద పరిశ్రమ విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తూ రాష్ట్రానికి మోసం చేయడమే కాకుండా లక్ష మందికి పైగా ఉద్యోగ ఉపాధినిచ్చే విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడం, కార్మిక ద్రోహి నరేంద్ర మోడీ గో బ్యాక్ అని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నెల 16న నంద్యాల, కర్నూలు జిల్లాల పర్యటన సందర్భంగా 15వ తేదీన నంద్యాల జిల్లా కేంద్రంలో కార్మిక సంఘాలు ఏఐటియుసి, సిఐటీయు, ఐఎఫ్టియు భారీ నిరసనకు సిద్ధమవు తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. జిల్లా సిపిఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి.సుంకయ్య, జిల్లా సిఐటీయు ప్రధాన కార్యదర్శి ఏ నాగరాజు, మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో వెనకబడ్డ ఉత్తరాంధ్ర రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇప్పటి వరకు అందలేదన్నారు. రాయలసీమ ప్రాంతంలో విద్య వైద్యానికి సంబంధించిన ఇన్స్టిట్యూషన్స్ ఏర్పాటు మరిచి పోయి, వాటిని పూర్తిగా ప్రైవేటీకరించే పద్ధతిని వ్యతిరేకిస్తూ గో బ్యాక్ నరేంద్ర మోడీ గో బ్యాక్ చంద్రబాబు అని ఈనెల 15న కార్మిక ద్రోహులైన మోడీ చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పేందుకు కార్మికులు ఉద్యోగులు 15వ తేదీన నంద్యాల జిల్లా కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి యేసురత్నం, పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు అధ్యక్షులు భూమని శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఎంతో మేలు

విశాలాంధ్ర - చాగలమర్రి : ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించి ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి బాటలు వేయాలని ఏఓ రాజేంద్ర ప్రసాద్ సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జ్ నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పెద్దవంగలి యూనిట్ ఇంచార్జ్ కదిరి బాష, శెట్టివీడు యూనిట్ ఇన్చార్జ్ నిరంజన్‌లు ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసి పండించిన ఆకుకూరలు, కూరగాయల విక్రయ కేంద్రాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు, రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సేంద్రీయ పద్ధతిలో సాగు చేసిన ఆకుకూరలు, కూరగాయలను విక్రయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,ఐసిఆర్‌పీలు పాల్గొన్నారు.

శ్రీశైలానికి ఫారెస్ట్ ప్రొడక్షన్ వాచర్స్

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : శ్రీశైలం నియోజకవర్గం పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, బైర్లూటి, నాగలూటి పరిధిలో గల 20 మంది ఫారెస్ట్ ప్రొడక్షన్ వాచర్లను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 16న శ్రీశైలం పర్యటన నేపథ్యంలో వారిని శ్రీశైలం అడివిలో నిఘ ఉంచేందుకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఆత్మకూరు డిఎఫ్ఓ డి.విగ్నేష్ అప్పవ్ ఆదేశాలతో రేంజర్ కృష్ణ ప్రసాద్, ప్రణీత బాయ్ పంపించడం జరిగిందని తెలిపారు.

ధ్వజస్తంభ ప్రతిష్ట కోసం భూమి పూజ

విశాలాంధ్ర-అవుకు: పట్టణ శివారులో వెలసిన కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట కోసం అర్చకులు ఆల్వకొండ శంకర్ శర్మ ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా అర్చకులు శంకర్ శర్మ మాట్లాడుతూ శివాల యం నందు నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట కోసం భూమి పూజ కార్య క్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. తన అన్న స్వర్గీయ ఆల్వ కొండ మల్లికార్జున శర్మ జ్ఞాపకార్థం సొంత నిధులతో నూతన ధ్వజస్తంభాన్ని తయారు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్తీక శుద్ధ పౌర్ణమి రోజున ధ్వజస్తంభ ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం నూతన కోనేరును నిర్మిస్తు న్నామని, అందుకు సంబంధించిన పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు తెలుగు రామప్ప, వెంకటేశ్వర్లు, గానాసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, నంద్యాల వర్కర్స్ యూనియన్, ఏఐటీయుసీ, ప్రభుత్వ హాస్పిటల్ మెడికల్ కాలేజీలో పని చేస్తున్న ఒప్పంద శానిటేషన్ వర్కర్లకు, సెక్యూరిటీ కార్మికులకు జీవో నెంబర్ 138 ప్రకారం కనీస వేతనాలు 26 వేల రూపాయలివ్వాలని అలాగే ఇతర సమస్యలు పరిష్కరించాలని డిఆర్ఓకు నాయకులు వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, మూడు సంవత్సరాల పిఎఫ్, ఇఎస్ఐ వెంటనే చెల్లించాలని, శానిటేషన్ వర్కర్స్‌ని వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ నంద్యాల పట్టణ ఎఐటీయుసీ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్ దగ్గర నిరసన తెలియజేసి అనంతరం డిఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల పట్టణ ఎఐటీయుసీ కార్యదర్శి డి.శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు భూమని శ్రీనివాసులు, మెడికల్ యూనియన్ అధ్యక్షురాలు సుశీలమ్మ, కార్మికులు తులసమ్మ, సులోచనమ్మ, పాములేటి, లీలావతి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

మోడీ పర్యటనను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - నందికొట్కూరు: ఈ నెల 16న గురువారం భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేయాలని కూటమి కార్యకర్తలకు ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం నందికొట్కూరు మార్కెట్ యార్డులో చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన టీడీపీ మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ అష్టాదశ శక్తి పీఠం, ద్వాదశ జ్యోతిర్లింగం రెండూ ఒకేచోట ఉంటూ భూమికి నాభిలా భకైలాసంగా విరాజిల్లుతూ నిత్య పూజలు అందుకుంటూ రాష్ట్రంలోనే రెండవ ప్రముఖ పుణ్య క్షేత్రంగా జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలానికి భారత ప్రధాన మంత్రి రావడం ఎంతో శుభపరిణామమనీ, రాయలసీమ అభివృద్ధికి ప్రధాన మంత్రి పర్యటన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు దేవళ్ళ మురళీ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ మండల కన్వీనర్లు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, పలుచాని మహేశ్వర రెడ్డి, గుండ్రెడ్డి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుండి రాయితీపై శనగ విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండలంలోని శనగ పంటను సాగు చేసే రైతులకు నేటి నుండి శనగ విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో రబీ 2025 సీజన్‌కు సంబంధించి రాయితీపై పప్పు శనగ పంపిణీ కార్యక్రమం ఉదయం 9 గంటలకు ఆరంభించడం జరుగుతుందన్నారు.

గో బ్యాక్.. మోడీ : కె.రామాంజనేయులు

విశాలాంధ్ర-డోన్ : ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ వామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన గో బ్యాక్ నిరసనకు చేతివృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజినేయులు మద్దతును తెలిపారు. సోమవారం డోన్ పట్టణంలో సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు ఆంధ్రప్రదేశ్‌కు విభజన సందర్భములో బిజెపి మద్దతుతో ఏపీకి పదేళ్ల పాటు ప్రత్యేక హోదా, వెనకబడిన రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీతో పాటు విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు ఏవి అమలు చేశారో ప్రధాన నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ పేరుతో పన్నులు పెంచి ప్రస్తుతం తగ్గించి, దాన్ని గొప్పగా చెప్పుకునేందుకు నరేంద్ర మోడీ పెట్రోల్, డీజిల్, గ్యాస్‌పై ఎందుకు జీఎస్టీ తగ్గించలేదో సమాధానం చెప్పాలన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.రాధాకృష్ణ, మండల కార్యదర్శి బి నారాయణ, జిల్లా సమితి సభ్యులు ఎస్. పులి శేఖర్ పాల్గొన్నారు.

ప్రధాని మోడీ బహిరంగ సభను చారిత్రక విజయంగా మారుద్దాం : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ప్రధాని మోడీ బహిరంగ సభను చారిత్రక విజయంగా మారుద్దామని మంత్రి ఫరూక్ కూటమి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన పార్టీ, బీజేపీల కూటమి ఆధ్వర్యంలో నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్‌లో భారీ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాని మోడీ హాజరుకానున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయడంపై చర్చించడానికి, కార్యాచరణ రూపొందించడానికి ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర న్యాయ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యే ఈ భారీ బహిరంగ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకొని, విజయవంతం చేయాలని, ఇది కేవలం ఒక సభ కాదు, రాష్ట్ర భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసే వేదిక అన్నారు. 16వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు కర్నూల్ సమీపంలోని రాగమయూరి వెంచర్‌లో జరుగు తుందన్నారు. ప్రతి డివిజన్, గ్రామం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చేలా కూటమి శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజ నేయులు, శాప్ చైర్మన్ రవి నాయుడు, పరిశీలకులు ఆలం నర్సం నాయుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికై బస్సుజాత - ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు విడుదల చేసి, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పిపిపి విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుల్లాయిస్వామి డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 22 నుండి నవంబర్ 12 వరకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సు జాతను జయప్రదం చేయాలని, నంద్యాల పట్టణంలో నవంబర్ 8న జరిగే బహిరంగ సభకు వేలాదిగా విద్యార్థులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో సోమవారం స్వామి రెడ్డి భవనం నందు బస్సు జాతకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో రద్దు చేస్తామన్న 107, 108, 77 జీవోలు రద్దు ఎప్పుడు రద్దు చేస్తారని నారా లోకేష్‌ని ప్రశ్నించారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకుల కేజీబీవీ మోడల్ హాస్టల్ విద్యార్థుల సమస్యలు, రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లాలో అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ రద్దుచేసి, ఏ విశ్వవిద్యాలయానికి సంబంధించి ఆ విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష నిర్వహించాలన్నారు. ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్, ఉపాధ్యక్షులు ఉదయ్, సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, జిల్లా నాయకులు శషి, ప్రవీణ్ చందు, మనోజ్ మతేష్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పశువుల కొట్టం దగ్ధం

విశాలాంధ్ర - రుద్రవరం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల సంబంధించిన అగ్ని ప్రమాదంలో పశువుల కొట్టం దగ్ధం కాగా, పశువులకు తీవ్ర గాయాలైన సంఘటన పేరూరు గ్రామంలో సోమ వారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. బాధితుడు గ్రామస్తులు అందించిన సమాచార మేరకు.. గ్రామానికి చెందిన తప్పేట నాగ శేషు రైతుకు సంబంధించిన పశువుల కొట్టం సోమవారం తెల్లవారు జామున సుమారు 2 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంబంధించింది. మంటలను గమనించిన బాధితుడు నాగ శేషు వెంటనే స్పందించి పశువులను బయటికి తరలించారన్నారు. ఈ ప్రమాదంలో ఆవు, రెండు గేదలు, రెండు దూడలు, నాలుగు లేగదూడలు, మూడు మేకలు మేక పిల్లలు ప్రమాదానికి గురి అయ్యాయన్నారు. మూడు పెద్ద గేదెలు మాత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాయన్నారు. సమాచారం తెలిసిన వెంటనే మండల పశువైద్యాధి కారి మనో రంజన్ ప్రతాప్ ఘటన స్థలానికి చేరుకొని పశువులకు తక్షణ వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యాన్ని అందించారని బాధితుడు, గ్రామస్తులు తెలిపారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

డాక్టర్ చిత్తలూరి మణిదీప్‌కు ఉత్తమ పరిశోధన పత్ర స్వర్ణ పతకం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రాష్ట్ర చెవి, ముక్కు, గొంతు అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయ వాడ నోవాటెల్ హెటల్‌లో గత మూడు రోజులుగా జరిగిన సంయుక్త 20వ దక్షిణ భారతదేశ 43వ చెవి, ముక్కు, గొంతు వైద్యుల సదస్సులో నంద్యాల మధుమణి ఆసుపత్రి చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ మణిదీప్ స్ఫీనాయిడ్ సైనస్ శస్త్ర చికిత్సలపై యువ వైద్యుల విభాగంలో సమర్పించిన పరిశోధన పత్రానికి ఉత్తమ పరిశోధన పత్రంగా యువ విభాగంలో బంగారు పతకానికి ఎంపిక చేశారు. రాష్ట్ర చెవి, ముక్కు, గొంతు వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ అప్పారావు, డాక్టర్ మూర్తి, డాక్టర్ రెహమాన్, డాక్టర్ కృష్ణ కిషోర్, డాక్టర్ కుమార్ చౌదరి లు ఈ పురస్కారాన్ని డాక్టర్ మణిదీప్ కు అందజేశారు. ఈ పురస్కారం అందుకున్న సందర్భంగా డాక్టర్ మణిదీప్ ను ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి. రవికృష్ణ, రాష్ట్ర ఐఎంఏ ఉపాధ్యక్షులు విజయభాస్కర రెడ్డి, రాష్ట్ర ఐఎంఏ మహిళా విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, నంద్యాల ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధు సూదనరావు, డాక్టర్ పనిల్ కుమార్, డాక్టర్ నాగమణి, డాక్టర్ వసుధలు అభినందించారు.

కార్మికుల క్లెయిమ్‌లను వెంటనే చెల్లించాలి

విశాలాంధ్ర - జూపాడుబంగ్లా: రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే చెల్లించాలని, కార్మికుల బోర్డును పునరుద్ధరించాలని ఎఐటీయూసి జిల్లా అధ్యక్షులు ఎం.రఘురామమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మల్లెం గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఏఐటియూసీ నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎం.రఘురామమూర్తి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు శ్రమించి కుటుంబాలను పోషిస్తున్నారని, ప్రభుత్వం వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా గతంలో కార్మికులకు పలు సంక్షేమ పథకాలు అందించేవని ఆయన తెలిపారు. ఏఐటియూసి కార్మిక సంఘాలు పోరాటాల వలన నిర్మాణ కార్మికుల సంక్షేమ కోసం బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డును పోరాడి సాధించుకోవడం జరిగిందన్నారు. బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు ప్రమాదాల్లో గాయపడి మరణించిన వారికి నష్టపరిహారాలు చెల్లించాలని వారన్నారు. కార్మికుల పిల్లలకు స్కాలర్ సీపులు, మహిళలకు ప్రసూతి సహాయాలు ప్రయోజనాలు అందేవన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో బిల్డింగ్ వెల్ఫేర్ ఫండ్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. దీనివలన 50 వేలకు పైగా భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన పెండింగ్ క్లైములను తీరికపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ కార్మికులతో చేపట్టిన సంతకాల సేకరణ పూర్తి చేసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు లాలు భాష బాబు మౌలాలి వాహబ్ అన్వర్ బాష, చంద్రశేఖర్, శివ,నాగేంద్ర, షాలు అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోందని బెల్టు షాపుల నిర్వహణ యదేచ్ఛగా కొనసాగుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. వైసీపీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఆళ్లగడ్డలో సోమవారం వైసీపీ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్య కర్తలు, మహిళలు వైసీపీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలికి వచ్చి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుండి ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాసులుకు మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, కౌన్సిలర్లు డాక్టర్ శీలం సుధామణి, గొట్లూరు సుధాకర్ రెడ్డి, వైకాపా నాయకులు డాక్టర్ శీలం సురేంద్రనాథ్ రెడ్డి, చాగలమర్రి ఎంపీపీ వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేసుకోండి

విశాలాంధ్ర-డోన్: గ్రామస్తులు ఐకమత్యంగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ప్రముఖ వైద్యులు ఎస్.సుంకన్న అన్నారు. బి.బొంతిరాళ్ళ గ్రామంలో సుంకులమ్మ పునఃప్రతిష్ట నిర్మాణానికి రూ.50 వేలను డాక్టర్ యశోద, సుంకన్న దంపతులు సర్పంచ్ జె.రవి మోహన్‌కు సోమవారం యశోద హాస్పిటల్‌లో అందజేశారు. ఈ డాక్టర్ సుంకన్న మాట్లాడుతూ గ్రామంలో అందరూ కలిసి కట్టుగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాలన్నారు. గ్రామభివృద్ధికి కుల, మతాలకు అతీతంగా అందరూ సహకరించు కోవాలన్నారు. సర్పంచ్ రవి మోహన్ మాట్లాడుతూ సంపాదించిన సొమ్ములో కొంత భాగం సేవా కార్యక్రమాలకు ఉపయోగించడంలో సంతృప్తి ఉంటుందన్నారు.

వైద్యుల రిలే దీక్షకు మద్దతుగా సిబ్బంది నిరసన

విశాలాంధ్ర-అవుకు: విజయవాడలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న వైద్యులకు మద్దతుగా ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. పట్టణంలోని సచివాలయం వద్ద ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన కోరికలను తీర్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు గత తొమ్మిది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారన్నారు. వారికి మద్దతుగా నల్ల బ్యాడ్జిలను ధరించి నిరసన తెలుపుతున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం వారి న్యాయమైన కోరికలను తీర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జోత్స్నా, వెంకటేశ్వరమ్మ, దానమ్మ, ఫర్హానా, హాజీ, సల్మాన్, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: చాగలమర్రి మండలం చింతల చెరువు గ్రామ దళితులకు తక్షణమే స్మశాన వాటిక ఏర్పాటు చేయక పోతే ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గసభ్యులు నాగ రాముడులు అధికారులను హెచ్చరించారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట వారు గ్రామస్థులతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతలచెరువు గ్రామంలో దళితులకు స్మశాన వాటిక లేక దశాబ్దాల కాలం గడుస్తుందని, అయితే స్మశాన వాటిక లేక ఎవరైనా చనిపోతే ఆ వ్యక్తిని ఖననం చేయడానికి వేళ్లెందుకు గ్రామంలో రైతులు దారి ఇవ్వక వాగుల వెంబడి వెళుతూ ప్రమాదపు అంచుల్లో చనిపోయిన వ్యక్తిని ఖననం చేయడానికి వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఎఐవైఎఫ్ నాయకులు మధు, పాములేటి,సిపిఐ నాయకులు ధనుంజయ, చింతలచెరువు గ్రామ ప్రజలు బుజ్జి, జ్యోతి, లక్ష్మమ్మలు పాల్గొన్నారు. అనంతరం డీఆర్ఓకు వినతిపత్రం అందజేశారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

విశాలాంధ్ర - చాగలమర్రి : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతనంగా భర్తీ చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులందరూ స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో ఎంఈఓలు అనురాధ,న్యామతుల్ల లకు తమ నియామక పత్రాలను అందజేసారు. అనంతరం వారికి కేటాయించిన పాఠశాలలో బాధ్యతలు చేపట్టారు. మండలంలో మొత్తం 30 మంది ఉపాధ్యాయులను కేటాయించగా మండలం లోని వివిధ పాఠశాలలోఎస్జీటీలు 21 మంది, ఉర్దూ పాఠశాలలకు ఇద్దరు ఎస్జీటీలు, ఉన్నత పాఠశాలలలో ఏడుగురు స్కూల్ అసిసెంట్లు విధుల్లో చేరారు. వీరికి ఎస్‌టియు, పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘాలు ఘన స్వాగతం పలికాయి. కార్యక్రమంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ పాండురంగ నాయక్, వైద్యులు శ్రీకాంత్‌లు ఈన్నారు సోమవారం పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయంలో కర్నూలు ఆర్క హాస్పిటల్ సీఈవో శ్రీనివాస తాంబే ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుండెకు సంబంధించిన ఈసీజీ 2డీ ఎకో బిపి షుగర్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించి, సుమారు 150 మందికి చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కా హాస్పిటల్ కార్పొరేట్ మేనేజర్ రవికుమార్, ఆర్గనైజర్ వినోద్, ఎల్ఐసి ఉద్యోగులు రవికుమార్, నాగన్న, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు.

యాగంటి ఉమామహేశ్వరలకు పల్లకి సేవ

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. ఆలయంలో కొలువైన ఉమామహేశ్వర స్వామికి ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి పల్లకీ సేవ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి పాండురంగారెడ్డి, యాగంటి పల్లె మౌళిశ్వర రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

విశాలాంధ్ర - కర్నూలు : రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ హాస్పిటల్స్ కి రావలసిన ఆరోగ్యశ్రీ పెండింగ్ నిధులు రూ.2.700 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులులి డిమాండ్ చేశారు. సోమవారం సిఆర్ భవన్ నందు ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, ఎం.బీసన్నలో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ప్రచార ఆర్భాటం తప్ప, ఆచరణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అందుకు ఉదాహరణ ఆరోగ్య శ్రీ కింద నెట్ వర్క్ హాస్పిటల్‌కి పెండింగ్ బిల్లు ఇవ్వక పోవడమన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయకపోవడంతో హాస్పిటల్ యాజమాన్యాలు ఈ నెల 10 నుండి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశారని, సామాన్య మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అత్యవసర వైద్యం అందక ఏ ఒక్కరి ప్రాణాలు పోయినా రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు కుమారు, రాజేంద్రలు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - కర్నూలు : ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, మెడికల్ కాలేజీ, ప్రభుత్వ రీజినల్ కంటి వైద్యశాలలో పని చేస్తున్న ఒప్పంద శానిటేషన్,సెక్యూరిటీ,పేస్ట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని మెడికల్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.మునెప్ప, రాష్ట్రసహాయ కార్యదర్శి జి.ప్రణీత్ కుమార్, జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్లు డిమాండ్ చేశారు. సోమవారం జెసికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.మునెప్ప మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ, వైద్య విధాన పరిషత్ హాస్పిటల్, డిస్పెనరీలోను పనిచేస్తున్న ఒప్పంద శానిటేషన్, సెక్యూరిటీ, పేస్ట్ కార్మికులకు 2025 అగ్రిమెంట్‌లో ఉన్న జీవో నెంబర్ 138 ప్రకారం కనీస వేతనం కార్మికులకు రూ.18,600, సూపర్‌వైజర్‌లకు రూ.21 వేలు అమలు చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేసి కార్మికులకు వారాంతపు సెలవులు, అర్జీత సెలవులు, జాతీయ పండుగ సెలవులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి నగర ఉప ప్రధాన కార్యదర్శి టి.రామాంజనేయులు, నాగరాజు, దసరాతు, బీసన్న, సురేష్, శ్రీరాములు, రాజు, విబిసిఎల్, బతుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

15న మండల సర్వసభ సమావేశం

విశాలాంధ్ర - హొళగుంద: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 15న ఎంపీపీ తంబాకు నూర్జాన్ బి.అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో విజయ లలిత సోమవారం తెలిపారు. సమావేశానికి జడ్పీటిసి, ఎంపీటీసీలు, సంబంధిత అధికారులు అందరూ తప్పకుండా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రజా సమస్యలు, మండలంలోని జరిగే అభివృద్ధి పనులపై చర్చిస్తామన్నారు. మండల సమావేశానికి అధికారం అందరూ చక్కటి ప్రణాళికలతో హాజరు కావాలని కోరారు.

మోడీ గో బ్యాక్ కరపత్రాలు విడుదల : సీపీఐ

విశాలాంధ్ర - కర్నూలు: ఈ నెల 16 జిల్లాకు ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాలచే పట్టిన నిరసన ర్యాలీ విజయవంతం చేయాలని కోరుతూ విడుదల చేసిన కరపత్రాలు విడుదల చేశారు. సోమవారం సీఆర్ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రావణి, శ్రీనివాసులు, నాయకులు కుమార్, నల్లన్న, పావని, నల్లన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ మోడీ పర్యటనను ప్రతి ఒక్కరూ నిరసన తెలియ చేయాలన్నారు. 16న జరుగుతున్న నిరసనను విజయవంతం చేయాలన్నారు.

హామీలను అమలు చేసి.. రాష్ట్రంలోకి రండి

విశాలాంధ్ర- చిప్పగిరి: రాష్ట్ర విభజన హామీలను అమలు చేసే ఆంధ్ర రాష్ట్రంలోకి భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ రావాలని సిపిఐ మండల కార్యదర్శి రంగన్న అన్నారు. సోమవారం మండల సిపిఐ మండల కార్యదర్శి రంగన్న మాట్లాడుతూ ఈనెల 16న భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్ర రాష్ట్రంలోని కర్నూలుకు వస్తున్న సందర్భంగా గో బ్యాక్ ప్రధాని అనే నినాదంతో ప్రధానమంత్రి పర్యటనను అడ్డుకోవాలన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హామీ తో పాటు రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజీ, కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ రద్దు వంటి హామీలను గాలికి వదిలేసి, జీఎస్టీ పేరుతో సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు మండల సిపిఐ కార్యదర్శి రామాంజనేయులు, మండల సహాయ కార్యదర్శి వెంకన్న, మండల కార్యవర్గ సభ్యులు రాముడు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి సిద్ధప్ప, నాయకులు కృష్ణకాంత్, సోము, శివ పాల్గొన్నారు.

మోడీ గో బ్యాక్.. రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర -ఆలూరు : నరేంద్ర మోడీ గో బ్యాక్ అనే నినాదాలతో వామ పక్ష పార్టీలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సోమవారం సిపిఐ, సిపిఎం భూపేష్, అంజి బాబు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలను విమర్శించారు. జీఎస్టీ అమలు వల్ల రాష్ట్రాలకు నష్టం జరుగుతోందని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. జీఎస్టీ తగ్గించినట్టు గొప్పలు చెప్పుకుంటున్నా, ప్రజలకు ఎలాంటి ఉపశమనం కలగలేదన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తామని, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకువెళ్తామని తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి రంగన్న, రైతు సంఘం తాలూకా కార్యదర్శి చాపల గోపాల్, సిపిఐ సిద్దేశ్వర కాలనీ శాఖ కార్యదర్శి సిద్ధిలింగ, పెద్ద హొటూరు రాముడు, సిపిఎం నాయ కులు నారాయణస్వామి, హనుమంతు, వెంకటేశ్వర్లు, కృష్ణ, శేఖర్, విటల్ పాల్గొన్నారు.

విద్యార్థిపై లైంగిక దాడి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర -ఆలూరు : హొలగుంద మండలంలో జరిగిన విద్యా ర్థిపై లైంగిక దాడి ఘటనపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో సీపీఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రిక విలేకరులతో సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ ఓ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిపై ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి లైంగిక దాడికి పాల్పడిన ఘటన చాలా దారుణమన్నారు. బాధితురాలికి న్యాయం చేయడానికి నిందితుడిపై వెంటనే ఫోక్సో చట్టం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం, పోలీసులు ఈ ఘటనపై తక్షణమే స్పందించి బాధిత విద్యార్థి భద్రతకు చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సమాజంలో మహిళలకు, విద్యార్థుల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు అవసరమని వారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రంగన్న, చాపల గోపాల్, సిద్ధిలింగ, రాముడు పాల్గొన్నారు.

నిజం రాస్తే తప్పా.. నిజాన్ని నిర్భయంగా రాసే పాత్రికేయులను కొంతమంది తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తీవ్రంగా ఖండించదగ్గ విషయం అని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, బాధ్యతలు ఉన్నవారికి వత్తాసు పలుకుతూ.. తప్పుడు వార్తలు రాసి బ్లాక్ మెయిల్ చేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్యంలో సరైందికాదన్నారు. సామాజిక సమస్యలను వెలుగులోకి తెచ్చే పాత్రికేయులు ప్రజలకు వాణిగా నిలుస్తారని, వారిని అణగదొక్కే ప్రయత్నాలు అంగీకార యోగ్యం కాదని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై నిజాయితీగా వార్తలు రాసే జర్నలిస్టులకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు.

అభివృద్ధి పనులను అడ్డుకోవద్దు

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలో జరిగే అభివృద్ధి పనులను ఏ ఒక్కరు అడ్డుకోవద్దని ఎమ్మెల్యే బి.విరుపాక్షి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఫిల్టర్ బెడ్ పక్కన జడ్పీ నిధులతో రూ.19 లక్షలతో నిర్మించే జీఎస్ఎల్ఆర్ ట్యాంక్ నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జడ్పీ చైర్మన్ ఎర్రభూతుల పాపిరెడ్డి తమ సమస్యలు విని, అందుకు స్పందించి రూ.19 లక్షల జెడ్పి నిధులు విడుదల చేశారన్నారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు చేయాలి తప్ప, అభివృద్ధి పనులపై రాజకీయం చేయడం తగదన్నారు. కూటమి నాయకులు అభివృద్ధికి ఏ నిధులు తీసుకొచ్చినా తాను సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ, వైసీపీ మండల కన్వీనర్ షఫీ ఉల్లా, ఆ పార్టీ నాయకులు ఈసా, కోకిల తోట శేషప్ప, కోకిల తోట ఎల్లప్ప, పంప, కాకి పకీరప్ప, ఎస్ కృష్ణయ్య, నూర్, అనుమప్ప, సిద్ధ, ఎస్కే గిరి, మర్రి స్వామి, కొండ అమ రేష్,తదితరులు పాల్గొన్నారు.

నరేంద్ర మోడీ పర్యటన వ్యతిరేకించండి

విశాలాంధ్ర - ఓర్వకల్లు: జిల్లాలో నరేంద్ర మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ ఈనెల 15న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమా లను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఆవుల రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం నందు మండల సహాయ కార్యదర్శి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆవుల రమేష్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జీఎస్టీ పేరుతో సామాన్యుడి నడ్డి విరిచి లక్షల కోట్లు వసూలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు జీఎస్టీ భారం తగ్గించి ప్రతి ఇంటికి 15 వేల రూపాయలు మేలు చేశామని అసత్య ప్రచారాన్ని నిర్వహించడానికి వస్తున్న నరేంద్ర మోడీ పర్యటన వ్యతిరేకించాలని ప్రజలను కోరారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాం ధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా అమరావతి శంకు స్థాపనకు రెండుసార్లు వచ్చిన నరేంద్ర మోడీ ఈ రాష్ట్రానికి ఏం చేశారని ప్రశ్నించారు, రాయలసీమ సస్యశ్యామలం కోసం తక్షణమే సిద్దేశ్వరం అలుగు ప్రాజెక్టును నిర్మించాలని, కడప స్టీల్ ప్లాంట్‌ను పూర్తి చేయాలన్నారు. రైతు సంఘం మండల అధ్యక్షులు మహబూబ్ బాష, ఏఐవైఎఫ్ నాయకులు వలి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరిక

విశాలాంధ్ర - గోనెగండ్ల: మండల వైస్ ఎంపీపీ పదవికి, ఎంపీటీసీకీ, పార్టీకి టి.రమణి కుమారి రాజీనామా చేశారు. టిడిపి సంక్షేమ పథకాలకు అభివృద్ధి పనులు చూసి, టిడిపి ప్రవేశ పెట్టిన సంక్షమ పథకా లకు ఆకర్షితులై వైసిపి నాయకులు టి.రమణీ కుమారి, వైసీపీ నాయ కులు మురళి నాయుడు, రాఘవేంద్ర నాయుడు, సలల్వాది రంగన్న, భారతం మహమ్మద్ తార, 200 మంది వైసీపి కుటుంబాలతో టిడిపిలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గోనెగండ్ల మండలం విజయకేతనం ఎగుర వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ డాక్టర్ తిరుపతయ్య నాయుడు, టౌన్ ప్రెసిడెంట్ మహేశ రహుమ్‌తుల్లా, టీడీపీ సీనియర్ నాయకులు బేతాళ బడేసా, అక్బర్, టీడీపీ కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్నలు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ నాయకులు మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ కల్పనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేస్ట్ కంట్రోల్ ఉద్యోగులకు జీవో నెంబర్ 138 ప్రకారం కనీస వేతనం రూ.18600, సూపర్వైజర్లకు రూ.21 వేలు వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఈ ఎస్ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే శానిటేషన్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనాలను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు వారాంతపు సెలవులు, అర్జిత, జాతీయ పండుగ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి దేవయ్య, కేసన్న, నాయకులు గుండు భాష, కాశి, కళావతి, లక్ష్మమ్మ, బాష తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీని సరిచేసి తగ్గించడం సరే.. క్షమాపణలు ఏవీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : జీఎస్టీని సృష్టించి, ఎనిమిదేళ్ల పాటు దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలను ఆర్థికంగా చిన్నాభిన్నం చేసి ఇప్పుడు జీఎస్టీని సవరించి తగ్గించామని, జబ్బలు చరుచుకుంటున్న ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రజలకు క్షమాపణలు చెప్పాలని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి నాగ మధు యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో నాగ మధు యాదవ్ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం 2017లో జీఎస్టీని 5 స్లాబ్‌లుగా విభజించి పేద మధ్యతరగతి ప్రజలపై విపరీతమైన పన్నుల భారాన్ని మోపిందని విమర్శించారు. జీఎస్టిని తగ్గించామని చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్ర మోడీని, ఎన్డీఏ కూటమి నాయకులను దేశ ప్రజలు నమ్మరని తెలిపారు. స్పెషల్ కేటగిరి స్టేటస్ ఇస్తానని రాయలసీమకు ప్రసిద్ధి గాంచిన వెంకటేశ్వర స్వామి సన్నిధి తిరుపతిలో మాట్లాడిన మాటలకు మోదీ సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనిద్ రాయల్, యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, శ్రీధర్ గౌడ్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి : సీపీఐ

విశాలాంధ్ర- వెల్దుర్తి: మండల పరిధిలోని ఎస్.బోయినపల్లె గ్రామంలో గ్యాస్ లీకేజీ ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వడ్డె అనిల్ను ఆదుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి టి.కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో టి.కృష్ణ మాట్లాడుతూ బాలుడు అనిల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు నిమ్స్ హాస్పిటల్లో గ్యాస్ ఏజెన్సీ వారు చికిత్స చేయించాలన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా గ్యాస్ ఏజెన్సీ ఆదుకోవాలని కోరారు. అనంతరం ఇంతవరకు గ్యాస్ లీక్‌అయి ప్రమాదంలో భార్య భర్త బాలుడు గర్భంలో ఉన్న శిశువుతో పాటు వారం రోజుల వ్యవధిలో మొత్తం నలుగురు మృతి చెందిన కూడా, జరిగి వారం రోజులైనా ఏజెన్సీకి సంబంధించిన వారు కుటుంబాన్ని పరామర్శించక పోవడం గమనించదగ్గ విషయం, గ్యాస్ ఏజెన్సీ బాలునికి మెరుగైన వైద్యం అందించక పోతే, పెద్ద ఎత్తున గ్యాస్ ఏజెన్సీ ముందు ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కోకిల రాజు, పట్టణ కార్యదర్శి గిరి, సహాయ కార్యదర్శి చిన్నమాదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: పట్టణంలో నెలకొల్పిన అమరావతి ఇంటర్నేషనల్ హై స్కూల్, స్టోన్ హిల్స్ వంటి ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అమరావతి ఇంటర్నేషనల్ హై స్కూల్, స్టోన్ హిల్స్, పాఠశాలలు జీవో నెంబర్-1ని అమలు చేయకుండా, ఇష్టమసారంగా ఫీజులు వసులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వా నిబంధనలకు విరుద్ధంగా 6:30ల వరకు పాఠశాలలు నిర్వహిస్తునారన్నారు. పలు పాఠశాలలకు పర్మిషన్ లేకున్న నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ నియయ నింబధను పాటించని పాఠ శాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న అందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. డివిజన్ కోశాధికారి శేఖర్, డివిజన్ నాయకులు మోహన్, తిరుమల, చరణ్, అబ్లా, ఉసేని పాల్గొన్నారు.

చేనేతలను ఆదుకోవాలి

విశాలాంధ్ర - నందవరం: సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న చేనేత కార్మికులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని చేనేతలు సంఘం నాయకులు ఎల్లేష్, చిన్న అదేన్న, రమేష్‌లు కోరారు. సోమవారం వారు డిటి మహేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్‌లో ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షాలు కురవడంతో మగ్గాల కింద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డమని, దీంతో చేనేతలు మగ్గం చేయడానికి వీలు లేకుండా పోయిందన్నారు. ఇదే విషయంపై 15 రోజులు క్రితం తహసీల్దార్‌కు చేనేతలకు నష్ట పరిహారం ఇవ్వాలని అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. అధికారులు మాత్రం తూతు మంత్రంగా వచ్చి విచారణ చేసి వెళ్లారని, దీంతో చాలామంది చేనేత కార్మికులు నష్టపోయారన్నారు. విచారణ 15 రోజుల తర్వాత చేయడంతో మగ్గం కింద నీరు ఇంకిపోవడం జరిగిందని, వెంటనే విచారణ చేస్తే ప్రతి ఒక్క చేనేత కార్మికుడికి నష్టపరిహారం అందుతుందన్నారు. కాబట్టి చేనేత మగ్గం వేసే ప్రతి చేనేత కార్మికులకు నష్టపరహారం అంది విధంగా చూడాలని కోరారు. విచారణ సమయంలో కూడా అధికారులు తమ సమస్యను వివరిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారన్నారని, చేనేత కార్మికులను కడుపు కొట్టొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో శాంతి, శశికళ, ఇందువతి, ఈరమ్మ, శకుంతలమ్మ పాల్గొన్నారు.

జీఎస్టీపై తగ్గింపుపై బైక్ ర్యాలీ

విశాలాంధ్ర - పెద్దకడబూరు: జీఎస్టీ తగ్గింపుపై ఎంపీడీఓ జయరాముడు ఆధ్వర్యంలో సోమవారం ఎన్ఆర్జీఎస్, ఐకెపి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ ఆవరణం వరకు బైక్ ర్యాలీతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయరాముడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్లు తగ్గించడం వల్ల సామాన్య ప్రజలకు, చిన్న వ్యాపారులకు, రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జీఎస్టీ రేట్లు తగ్గడంతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగి కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ విదేశీ వస్తువులను విడచి స్వదేశీ వస్తువులను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ చంద్రశేఖర్, ఎపీఎం శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి దస్తగిరి, స్వచ్ఛ భారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ నారాయణ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీ శనగలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - దేవనకొండ: మండల రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ శనగలను రాయితీలను రైతులు ఉపయోగించుకోవాలని వ్యవసాయ అధికారి బి.ఉషారాణి ఆధ్వర్యంలో రబీ సీజన్ 2025 సందర్భంగా రైతులకు సబ్సిడీ శనగలు పంపిణీ కార్యక్రమన్ని స్థానిక రైతు సేవ కేంద్రం నందు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల్ల బొజ్జమ్మ హాజరై రైతులకు శనగలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ ఆలూరు నియోజకవర్గ ఇంచార్జి వెంకటరాముడు, మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, మాజీ జడ్పీటీసీ ఉచ్చిరప్ప, మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, అలారుదిన్నె మల్లయ్య, రామా రావునాయుడు, మల్లికార్జున గౌడ్, గిడ్డయ్య గౌడ్, నాగరాజు గౌడ్, కాకర్ల శాంతికుమార్, మాల బండ్లయ్య, బీజేపీ మండల కన్వీనర్ కిరణ్ కుమార్, బోడ రవికుమార్, జనసేన నాయకులు కటిక ఉచిరప్ప తదితరులు పాల్గొన్నారు.

సభ ప్రాంగణం ఏర్పాట్లు పరిశీలించిన పలువురు

విశాలాంధ్ర - ఓర్వకల్లు: ప్రధాన మంత్రి పర్యటన సందర్భంగా సోమవారం జిల్లా ఇంచార్జీ మంత్రి నిమ్మల రామానాయుయుడు, రాష్ట్ర రోడ్డు భావనల శాఖ మంత్రి వర్యులు బి.సి.జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు పల్లె శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి, ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, ఎమ్మెల్సీ బి.టి.నాయుడు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహా, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త సత్య నారాయణ రాజు, తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నరేంద్ర మోడీ సభను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: కర్నూలోఈనెల 16న జరిగే దేశ ప్రధాని నరేంద్ర మోడీ సభను విజయవంతం చేయాలని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, బాబ్జి అన్నారు. సోమవారం మండలం పరిధిలోని కంబాలపాడు గ్రామంలో వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల నాయకులు కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులకు, క్లస్టర్ సభ్యులు సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిశీలకుడు అనంతపురం ఆదినారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరిశ్రమలు, పెట్టు బడులు వస్తున్న క్రమంలో ప్రధాని వాటిని ప్రారంభించే లక్ష్యంతో ఇక్కడ సభనుఏర్పాటు చేస్తున్నామన్నారు. జీఎస్టీ తగ్గింపు విషయం ప్రజల్లోకి తీసుకోవాల్సిన బాధ్యత కూటమి నాయకులపై ఉందన్నారు. పత్తికొండ మార్కెట్ యార్డ్ చైర్మన్ నబీసాహెబ్, పార్టీ మండల అధ్యక్షులు దామోదర్ నాయుడు, మర్రి శ్రీరాములు, జ్ఞానేశ్వర్ గౌడ్ సుబ్బరాయుడు, రఫీ సాహెబ్, ఎల్వి ప్రసాద్, గురు స్వామి, కేఈ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ సమర్ధవంతంగా పని చేయాలి

విశాలాంధ్ర - ఓర్వకల్లు : కమాండ్ కంట్రోల్ రూమ్ సమర్ధవంతంగా పని చేయాలని ప్రధానమంత్రి ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్, సీనియర్ ఐఎఎస్ అధికారి వీర పాండియన్ అన్నారు. సోమవారం ప్రధానమంత్రి పర్యటన సందర్భంగా నన్నూరు రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంలో కంట్రోల్ రూమ్ పని తీరుపై ప్రధానమంత్రి ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వీర పాండియన్ మాట్లాడుతూ కంట్రోల్ రూమ్‌లో పని చేసే వారు 24 గంటలు షిఫ్టల వారిగా డ్యూటీలు వేసుకొని ప్రతి 3 గంటలకు ఒకసారి అని టీంల నుండి సమాచారం తెప్పించుకోవాలన్నారు. ప్రతి టీమ్ చేస్తున్న పని ఏ రకంగా జరగాలో ఆ రకంగా జరుగుతుందా, లేదా, సరైన సమయంలో పనులు మొదలుపెట్టారా, లేదా, నిర్దేశించిన సమయంలో పని పూర్తయిందా, లేదా అనే వివరాలను సేకరించి తెలియజేయడానికే కంట్రోల్ రూమ్‌లో టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి, ఐఎఎస్ అధికారి విజయ సునీత, దినేష్, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువంశీ, సచిన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-పత్తికొండ: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థులపై విచక్షణా రహితంగా దాడి చేసిన ఉపాధ్యాయుడు సురేష్‌పై చర్యలు తీసుకో వాలని ఏఐ ఎస్ఎఫ్ మండల కార్యదర్శి శివ, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవుల పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్, ఏబీవీపీ నాయకులు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న వంశీ, జస్వంత్‌లు తరగతి గదిలో అల్లరి చేస్తున్నారన్న నెపంతో గణిత ఉపాధ్యాయులు సురేష్ విచక్షణా రహితంగా దాడి చేసి గాయపరచడం సరైంది కాదన్నారు. తహసీల్దార్ హుస్సేన్ సాహెబ్‌కు వినతి పత్రం అందజేశారు. విద్యార్థి సంఘాల నాయకులు అశోక్, అరవింద్, విష్ణు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 14, అక్టోబరు 2025

లైసెన్స్ లేకుండా బాణాసంచా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దీపావళి పండుగ సందర్భంగా దుకాణదారులు ఎవరైనా లైసెన్స్ లేకుండా బాణాసంచా విక్ర యాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ మురళీధర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం తన కార్యా లయంలో విలేకరులతో మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. టపాకాయలను కొనుగోలు చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు పొందిన షాపుల వద్దనే కొనుగోలు చేయాలన్నారు. ఎవరైనా అను మతి లేకుండా స్టాళ్లు వేసి బాణసంచా నిల్వ ఉంచినా, విక్రయించినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసు కుంటామన్నారు. దుకాణదారులు తమ షాపు పరిస రాల్లో అగ్ని ప్రమాదం జరగకుండా అత్యంత జాగ్ర త్తలు తీసుకోవాలన్నారు. షాపు వద్దనే టపాసులు కాల్చడం పూర్తిగా నిషేధమని, ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే దుకాణదారులపైనే పూర్తి బాధ్యత ఉంటుందన్నారు. అధికారులు సూచించిన ప్రదేశా ల్లోనే బాణసంచా షాపులు ఏర్పాటు చేయాలన్నారు. అక్రమ విక్రయాలు ఎవరైనా చేస్తే ప్రజలు వెంటనే తన ఫోన్ నెంబర్ 9121101166కు సమాచారం ఇవ్వాలని, సమా చారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామ న్నారు. జిల్లా ఎస్పీ సునీల్ షేరాన్ ఆదేశాల మేరకు డీఎస్పీ ప్రమోద్‌తో కలిసి ఇప్పటికే లైసెన్సు పొందిన దుకాణాలపై తనిఖీలు చేపట్టామని వెల్లడించారు. ఎవరైనా నియమా వళిని ఉల్లంఘిస్తే వదిలిపెట్టం అని స్పష్టం చేశారు. దీపావళి పండుగను సురక్షితంగా జరుపుకోవాలన్న లక్ష్యంతో బాణ సంచా దుకాణాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టార న్నారు. సురక్షిత దీపావళి అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరు సురక్షితంగా దీపావళి పండుగను కుటుంబంతో కలిసి సంతోషంగా నిర్వహించుకోవాలని సీఐ మురళీధర్ రెడ్డి ఆకాంక్షించారు.

కోగిలతోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మహర్దశ

- మెగా డీఎస్సీ ద్వారా నూతనంగా 14 మంది ఉపాధ్యాయుల నియామకం
- విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవధుల్లేని ఆనందం
- కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన కోగిలతోట గ్రామ ప్రజలు

విశాలాంధ్ర-హొళగుంద: మండలంలోని కోగిలతోట గ్రామానికి మెగా డీఎస్సీ ద్వారా 14 మంది టీచర్లు రావడం వలన గ్రామంలోని ప్రజలు ఎస్ఎంసి చైర్మన్, వైస్ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రు లు హర్షం వ్యక్త పరిచారు. సోమవారం మా ఊరికి ఇంతమంది టీచర్లు రావడం మాకు సంతో షకరంగా ఉందని అన్నారు. మారు మూల గ్రామం అయి నప్పటికీ ఇంత మంది ఉపాధ్యాయులు రావడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ సంతోషకరమైన వాతావరణంలో ఉపాధ్యాయులను పూలమాలలతో సత్కరించి విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో నూతనంగా వచ్చిన 14 మంది ఉపాధ్యా యులను పూలు జల్లతో డప్పు, వాయిద్యాల ఊరేగింపుతో కోగిలతోట గ్రామ బస్టాండ్ నుంచి ఉన్నత పాఠ శాలకు ర్యాలీగా అంగరంగ వైభవంగ ఊరేగిం చారు. గ్రామ ప్రజలు, ఎస్ఎంసి చైర్మన్, వైస్ చైర్మన్లు మాట్లాడుతూ నూతన ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు అభినందించారు. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను బోధించి, బావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని, ఇన్ని రోజులు పిల్లలకు టీచర్లు తక్కువగా ఉన్నందువలన విద్యార్థులకు చదువు కొరత ఏర్పడిందని, ఆ కొరతను కూటమి ప్రభుత్వం భర్తీ చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ విద్యార్థిని విద్యార్థినీయులను ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చెయ్యాలని కోరారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన



విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్ : స్థానిక క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా విభాగం వారు కళాశాల విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి అధ్యక్షతన, ఎన్‌సిసి విభాగం, కామర్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్వభారతిమెడికల్ కాలేజీ ఈఎన్టి డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ మహేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు సిపిఆర్ గురించిన పలు విషయాలు వివరించారు. ఈ కార్యక్రమం లో ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ రమేష్ బాబు, రెడ్ క్రాస్ ఫాకల్టీ సభ్యులు మదన్ మోహన్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.సత్యనారాయణ, ఎన్‌సిసి ఏఎన్ఓ డాక్టర్ కామల్లీ నాయక్, డాక్టర్ డి.నాగన్న, డా.వి.వింధ్యవాసిని దేవి, ఎ.వెంకట స్వామి పాల్గొన్నారు.

స్టేట్ లెవెల్ మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులు

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో కర్నూల్ మెడికల్ కాలేజీ అనస్తీసియా విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.చందన రాజారాం స్విమ్మింగ్‌లో ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రీస్ట్ స్ట్రోక్ యందు ఒక గోల్డ్ మెడల్,రెండు సిల్వర్ మెడల్స్,ఒక కాస్యం సాధించడం పట్ల ఏడిఎంఈ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ హర్షం వ్యక్తం చేశారు. కర్నూలు మెడికల్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ రాష్ట్రస్థాయిలో వైద్య విద్యలో ప్రతిభ కనబరచడమే కాకుండా విభిన్న రంగాల్లో ప్రతిభ కనపంచడంతో సంతోషాన్ని వ్యక్తపరిచారు.

పబ్బతి చిన్మయి మరెన్నో విజయాలు సాధించాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ఫెన్సింగ్‌లో ఏషియన్ గేమ్స్ నందు సత్తా చాటిన పబ్బతి చిన్మయి శ్రేయ అంతర్జాతీయ స్థాయిలో మరెన్నో విజయాలు సాధించాలని మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆకాంక్షించారు. సోమవారం పద్మావతినగర్‌లోని ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు, బిల్డర్ పబ్బతి వేణుగోపాల్ స్వగృహానికి మైనార్టీశాఖమంత్రి ఫరూక్, శాప్ చైర్మన్ రవినాయుడు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, టిడిపి నాయకులు చాబోలు ఇలియాస్ విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఫెన్సింగ్ క్రీడాకారుని పబ్బతి చిన్మయి శ్రేయతో ఫెన్సింగ్ క్రీడకు ఎక్కడ కోచింగ్ తీసుకున్నారనే వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఫెన్సింగ్ క్రీడలో జిల్లా కీర్తిని అంతర్జాతీయంగా మారుమోగేలా చేశావని ప్రత్యేకంగా అభినం దించి, శాలువా కప్పి సత్కరించారు. పబ్బతి వేణుగోపాల్, అడ్వకేట్ అపర్ణ దంపతులు మంత్రి ఎన్ఎండి ఫరూక్, శాప్ చైర్మన్ రవినాయుడు, టిడిపి నాయకులు ఎన్ఎండి ఫిరోజ్ లను సత్కరించారు.

ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, బలరాం నూతన ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 2025 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికై బాధ్యతలు తీసుకున్న నూతన ఉపాధ్యాయులకు ఎస్టీయూ మండల శాఖ నాయకులు అభినందనలు తెలిపారు. నూతన ఉపాధ్యాయులకు ఎస్టీయూ క్యాలెండర్, సేవా పుస్తకం, ఉద్యోగరీత్యా అవసరమైన ఫారమ్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఎల్లవేళలా చేదోడు వాదోడుగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు మారుతి, వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటుపై సన్నద్ధం

విశాలాంధ్ర - కర్నూలు వైద్యశాల: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఆదేశాలమేరకు కర్నూలు వైద్య కళాశాల ఆడిటోరియం నందు 16వ తారీఖున జరగబోయే ప్రధానమంత్రి కార్యక్రమం నందు వైద్య శిబిం ముల ఏర్పాటుపై వైద్య సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహిం చారు. ఈ శిక్షణా కార్యక్రమం నందు డిఐఓ డాక్టర్ ఉమా మాట్లా డుతూ 11 చోట్ల పార్కింగ్ సదుపాయము ఏర్పాటుచేయడం జరిగి నదని, ప్రతి పార్కింగ్ ఏరియా నందు వైద్యాదికారి, స్టాఫ్ నర్స్, సూపర్వైసర్, ఎమ్మెల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లతో కూడిన టీం వారికి కేటాయించిన ప్రదేశమునందు ప్రథమ చికిత్స కిట్, అవస రమైన మందులు, ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచుకొని ప్రతి కేంద్రంలో హెల్త్ టీం, మెడికల్ కిట్ తో చికిత్స కేంద్రానికి హాజరు అయిన సందర్శకులకు వైద్య సేవలు అందించాలని తెలిపారు.

కల్తీ మద్యం, బెల్టు షాపులను అరికట్టాలి

విశాలాంధ్ర-పత్తికొండ: కల్తీ మద్యం, బెల్టు షాపులను అరికట్టాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి డిమాండ్ చేశారు. వైసీపీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం పత్తికొండలో మాజీ ఎమ్మెల్యే స్వగృహం నుండి ఎక్సైజ్ కార్యాలయం వరకు మహిళలతో భారీ ర్యాలీ చేపట్టి, ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మద్యం ధార పోసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలోనే విచ్చలవిడిగా కల్తీ మద్యం విక్రయాలు, బెల్ట్ షాపులు పెరిగిపోయాయని ఆరోపించారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము దీపిక, ఎంపీపీ నారాయణదాసు, మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, వైసిపి మండల కన్వీనర్ కారం నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, మాజీ సర్పంచ్ సోమశేఖర్, జిట్టా నాగేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు రూరల్ : పట్టణంలోనీ వైసిపి కార్యాలయం నుండి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కార్యాలయం ముందు నిరసన తెలియజేసి వినతి పత్రం అందజే శారు. శివ నీలకంత, ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి, బుట్టా ప్రతుల్, నియోజకవర్గ స్థాయి నాయకులు కె.ఆర్ మురహరి రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏలుతున్న ప్రభుత్వ పెద్దలు, రాష్ట్రాన్ని మద్యం మత్తులో ముంచెత్తారన్నారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ములకలచెరువులో, ఇబ్రహీంపట్నంలో కల్తీ మద్యం ఫ్యాక్టరీలు బయటపడినప్పుడే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి లిక్కర్ షాపులో సోదాలు చేయాల్సిందన్నారు.



విశాలాంధ్ర - కోడుమూరు: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ మద్యం విధానాల వల్ల కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు బలైపోతున్నాయని వైసీపీ కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ ఆదిమూలపు సతీష్ తీవ్రంగా మండిపడ్డారు. కూటమి ప్రభుత్వమంటే దోచుకోవడం, పంచుకోవడం, దాచుకోవడం అన్నరీతిలో కూటమి నేతలు ప్రజలను దోచుకుంటున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. సోమవారం వైసీపీ ఎస్ఈసీ సభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి ఆదేశాలతో పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, పెద్దఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ప్రవీణ్ రైస్ మిల్లు వద్ద నుంచి కోడుమూరు జడ్పిటిసి రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ రమేష్ నాయుడుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ మాధవి,వార్డు సభ్యురాలు అనురాధ, వైసిపి నాయకులు ప్రవీణ్, సాజిత్ అలీ, వేణుగోపాల్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, హనుమంతు, సిరిగిరి మద్దిలేటి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర -ఆలూరు : ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కల్తీ మద్యం వల్ల అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని, కూటమి ప్రభుత్వం కల్తీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో అధికారులకు ఎమ్మెల్యే, వైసీపీ నాయకులు, పెద్ద ఎత్తున తరలివచ్చి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే పత్రిక విలేకరులతో మాట్లాడుతూ నకిలీ మద్యాన్ని అరికట్టాలని మహిళల పుస్తెలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుదు ఆదుకుంటున్నాడని, మహిళల, చిన్నారుల, వృద్ధుల మాన ప్రాణాలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లికార్జున ముసనపల్లి మాజీ సర్పంచ్ సోమశేఖర్, అరికెర వెంకటేష్, అర్థగేరి శీనప్ప, జిల్లా ఉపాధ్యక్షులు గిరి, మాజీ ఎంపీటీసీ భాస్కర్, తుమ్మలబీడు మల్లికార్జున, రాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

బాలికల హక్కులను పరిరక్షిద్దాం



విశాలాంధ్ర - పెద్దకడబూరు: బాలికల హక్కులను పరిరక్షిద్దామని ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయకుమారి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రమ్మైన పెద్దకడబూరులోని స్థానిక సచివాలయం-2 నందు అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం పాలసీ సూత్ర దారులను అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర - నంది కొట్కూరు: నకిలీ మద్యం పాలసీ సూత్ర దారులను అరెస్ట్ చేయాలని నందికొ ట్కూరు వైసీపీ సమన్వయకర్త డా.సుధీర్ దారా ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సోమ వారం ప్రభుత్వ నకిలీ మద్యం విధానాన్ని వ్యతిరేకిస్తూ సమన్వయకర్త డా.సుదీర్ దారా ఆధ్వర్యంలో నందికొట్కూరు ఎక్సైజ్ కార్యలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా నందుకొట్కూరు పట్టణంలోని పాతబస్టాండ్ పటేల్ సెంటర్ నుండి భారీ ర్యాలీగా వైసీపీ నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా డా.సుదీర్ దారా మాట్లాడుతూ నకిలీ మద్యం విధానాన్ని అరికట్టి నకిలీ పాత్ర దారులను అరెస్ట్ చేయాలని, లేక పోతే తమ పార్టీ ప్రజల తరపున పోరాటం ఉధృతం చేస్తామని ప్రభుత్వన్ని హెచ్చరించారు. అనం తరం ఎక్సైజ్ ఎస్ఐ జఫ్రూలాకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు యుగంధర్ రెడ్డి, దివ్య, కల్లి మునిస బేగం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైసీపీ సీనియర్ నాయకులు చిన్న మల్లారెడ్డి, తులసి రెడ్డి, మల్లికార్జునరెడ్డి, దేవనూరు షరీఫ్, లోకేశ్వర్ రెడ్డి, రమణ, దౌలత్ బాష, పుల్యాల నాగిరెడ్డి, రమేష్ నాయుదు, సులోచన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: రాష్ట్రంలో కల్తీ మద్యం వల్ల అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయని, కూటమి ప్రభుత్వం కల్తీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు వైసీపీ మహిళ నేతలు, నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి వినతిపత్రం అందజేశారు. నకిలీ మద్యాన్ని అరికట్టాలని మహిళల పుస్తెలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆడుకుంటున్నాడని, మహిళల, చిన్నారుల, వృద్ధుల మాన ప్రాణాలను కాపాడాలని, రక్షణ కల్పించాలని నంద్యాల మహిళలు వైసిపి నాయకులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దాల్మిల్ అమీర్, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మహిళా విభాగం జనరల్ సెక్రెటరీ శశికళరెడ్డి, జిల్లా మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, తదితర నాయకులు పాల్గొన్నారు.



విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : నకిలీ మద్యంపై సీబీఐ విచారణ చేపట్టాలని వైసీపీ డిమాండ్ చేశారు. కల్తీ మద్యానికి నిరసనగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదేశాల మేరకు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కర్ర హర్షవర్ధన్ రెడ్డి, జిల్లా వైసీపీ ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట మద్యాన్ని పారబోసి మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో యాదచ్చేగా నకిలీ మద్యం ఏరులై పారుతుందన్నారు. నాడు జే బ్రాండ్ అన్న కూటమి ప్రభుత్వం, మరి ఇది ఏ బ్రాండో చెప్పాలని ప్రశ్నించారు. బనగానపల్లి మండల జెడ్పీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మమ్మ, మండల పరిషత్ అధ్యక్షురాలు మానసవీణ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి అంబటి రవికుమార్ రెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు సన్నల జనార్దన్ రెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విశాలాంధ్ర - డోన్ రూరల్: రాష్ట్రం లో బెల్టు షాపులను అరికట్టాలనీ వైసీపీ అధ్యక్షులు గౌరవనీయులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు డోన్ వైసిపి ఆఫీసు నుంచి వైసీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. నారావారి నకిలీ మద్యంను వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరుబాట కార్యక్రమంలో డోన్ నియోజకవర్గంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆదేశాల ప్రకారము ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ వరలక్ష్మికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైసీపీ వాలంటరీ విభాగం అధ్యక్షులు పోస్ట్ ప్రసాద్, దినేష్ గౌడ్, రామ చంద్రుదు, మల్లి కార్జున రెడ్డి, సోమేష్ యాదవ్, వైసీపీ రఫీ, ఆర్ట్ రమణ, అశోక్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: రాష్ట్రంలో నకిలీ మద్యం సరఫరా, బెల్టు షాపులు రద్దు చేయాలని వైసిపి పట్టణ అధ్యక్షులు సయ్యద్ మీర్, మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డిలు అన్నారు. సోమవారం పట్టణంలో శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో నకిలీ మద్యం సరఫరా, బెల్టు షాపులు రద్దు కొరకు రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలాగా అన్ని ప్రాంతాల్లో తయారుచేసి ప్రజల ప్రాణాలని హరిస్తున్న పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ కార్యాలయం నందు ఎస్సై వీరస్వామిని కలిసి మెమోరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయండి..

విశాలాంధ్ర - హొళగుంద: మండలానికి నూతనంగా బాధ్యతలు చేపట్టే ఉపాధ్యాయులతో ఎమ్మార్సీ కార్యాలయం సోమవారం కిటకిట లాడింది. ఎంఈఓ సుధారాణి హెబ్బటం పాఠశాలకు ఎస్జీటీగా ఎంపికైన కురువ అపర్ణకు, చిన్నహేట జడ్పీ హైస్కూల్ మ్యాథమెటిక్స్ ఉపా ధ్యాయురాలిగా ఎంపికైన సింధవా లామ్ సింధుజలకు ఆర్డర్ పత్రాలు మొదటిసారిగా అందించి, ఉపాధ్యాయుల పదవీ బాధ్యతల కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఎంఈఓ-1 సుధారాణి, ఎంఈఓ-2 కబీర్ నూతన ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించి, డీఈవో ఇచ్చిన ఆదేశా లను పరిశీలించి ఆయాపాఠశాలలకు వీధుల్లో చేరేలా ఆదే శాలు ఇచ్చారు. ఎంఈఓ-1 సుధారాణి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల బాధ్యత ఎంతో గురుతరమైనదన్నారు. మండలంలో 242 ఉపాధ్యాయులకు 164 మంది ఉపాధ్యాయులను మండలానికి డిఇఓ మంజూరు చేశారని అన్నారు.

వాటర్ ప్లాంట్‌కు భూమి పూజ

విశాలాంధ్ర- నంది కొట్కూరు: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణం లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందిం చాలనే లక్ష్యంతో రూ.10 లక్షల ఎంపీ నిధులతో నూతన వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులకు సోమవారం మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా శుద్ధమైన నీటి సరఫరా అందించడానికి నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రజలకు మరింత మెరుగైన మౌలిక సదుపా యాలు అందించడమే తమ లక్ష్యమన్నారు. పట్టణ ప్రజలకు ఏ సమ స్యలు ఉన్నప్పటికీ ఎంపీ బైరెడ్డి శబరి సహకారంతో పట్టణాన్ని అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. టిడిపి నాయకులు నాగేశ్వరరావు, స్థానిక కౌన్సిలర్లు పి. చాంద్ భాష, లాలు ప్రసాద్, వార్డు ఇంచార్జ్‌లు ఉస్మాన్ బేగ్, సప్లయర్ సత్యనారాయణ, వీఆర్ శ్రీను, షైటు మురళి, గుణశేఖర్ రెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లాకు రానున్నారని, ఈ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, తాలూకా టీడీపీ ముఖ్య నాయకులు భార్గవ్ రామ్, భూమా జగద్విఖ్యాత్ రెడ్డిలు కోరారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో వారు అధికారులతో, టీడీపీ మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులతో విడివిడిగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన ఉమ్మడి జిల్లాకు తొలిసారిగా రానున్నారని అందరము సమిష్టిగా కృషిచేసి సభను విజయవంతం చేయాలని కోరారు. మన నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు, తెదేపా నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లేలా కార్యాచరణ చేయాలని పిలుపునిచ్చారు.

ఉచితంగా సర్వీస్ రిజిస్టర్ ఫార్మ్స్ పంపిణీ

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మెగా డీఎస్సీ 2025 నూతన ఉపా ధ్యాయులకు ఎస్టియు ఆదోని నియోజకవర్గం శాఖ ఆధ్వర్యంలో ఎంఈ ఓలు భూపాల్ రెడ్డి శ్రీనివాసులు చేతుల మీదుగా ఉచితంగా సర్వీస్ రిజిస్టర్, ఫార్మ్స్ పంపిణీ చేశారు. సోమవారం పట్టణ, మండలాలలోని వనరుల కేంద్రం నందు మెగా డీఎస్సీ 2025 నూతన 129 ఉపాధ్యా యులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్టీయూ చేస్తున్న సేవలను కొనియాడారు. సర్వీస్ రిజిస్టర్ గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అకడమిక్ కమిటీ సభ్యులు మహాదేవప్ప, ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న మాట్లాడుతూ మెగా డిఎస్సీ ద్వారా ఎంపిక అయిన ఉపాధ్యాయులను ఉద్దేశించి ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని, గొప్పదని ఉపాధ్యా యులు అంకిత భావంతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సుధాకర్, భీమరాజు, రామకృష్ణ, శ్రీనివాసులు, జయరాం పాల్గొన్నారు.

వైద్యులకు రిలే దీక్షకు మద్దతుగా నిరసన..

విశాలాంధ్ర-గోనెగండ్ల: విజయవాడలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న వైద్యులకు మద్దతుగా గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. గోనెగండ్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, సచివాలయంసిబ్బంది, నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన కోరికలను తీర్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు గత తొమ్మిది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారన్నారు. వారికి మద్దతుగా నల్ల బ్యాడ్జిలను ధరించి నిరసన తెలియజేస్తున్నామని అన్నారు. వెంటనే ప్రభుత్వము వారి న్యాయమైన కోరికలను తీర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, హనుమంతు, పరేశప్ప, కృష్ణ, కృష్ణుడు, బలరాం, మేరి గోల్డ్, భారతి, శాంతమ్మ, ప్రమీల, రాజమ్మ, స్రవంతి, ఏఎన్ఎంలు, ఆశాలు మైమున్ బేగం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ తరుపున ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర - వెలుగోడు: పేద ఆర్య వైశ్య కుటుంబాలను ఆదుకోవ డానికి వాసవి క్లబ్ ఎప్పుడు ముందుంటుందని వాసవి క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ఇటీవల వెలుగోడు వాసవి క్లబ్ సభ్యురాలు నాగేల్ల భ్రమరాంబ శివైక్యం పొందారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి గమనించి తాడిపత్రి వాసవి క్లబ్ సంఘము నుంచి రూ.11,500లను మరియు రీజనల్ చైర్ పర్సన్ లింగం నాగ శైలజ రూ. 500లు మొత్తం రూ.12 వేలను ఆ కుటుంబ సభ్యులకు సోమవారం అంద జేశారు. వెలుగోడు వాసవి క్లబ్ ప్రెసిడెంట్ సంజీవరాయ ప్రసాద్, నంద్యాల నందనం వాసవి క్లబ్ ప్రెసిడెంట్ బాదం నాగేంద్ర, క్లబ్ సభ్యులు మెడికల్ స్టోర్ రాము, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లాలో 16వ తేదీ గురువారం ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేద్దామని ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు. సోమవారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ అష్టాదశ శక్తి పీఠం, ద్వాదశ జ్యోతిర్లింగం రెండూ ఒకేచోట ఉంటూ భూమికి నాభిలా భూ కైలాసంగా విరాజిల్లుతూ నిత్య పూజలు అందుకుంటూ రాష్ట్రంలోనే రెండవ ప్రముఖ పుణ్యక్షేత్రంగా ఉన్న శ్రీశైలానికి ప్రధాని రావడం ఎంతో శుభ పరిణామమని, రాయలసీమ అభివృద్ధికి ప్రధానమంత్రి పర్యటన ఎంతో ఉపయోగపడుతుందన్నారు. శ్రీశైల శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామి వార్లకు ప్రధాని నరేంద్రమోడీ ప్రత్యేక పూజలు, దర్శనం అనంతరం ఓర్వకల్లు మండలం నన్నూరు వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు లబ్ధి చేకూరే అంశం, రాయలసీమ అందులో నంద్యాల జిల్లా సమగ్రాభివృద్ధిపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగించనున్నారని ఆమె తెలిపారు. ఈ బహిరంగ సభకు సుమారు 3లక్షలకు పైగా ప్రజలతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.